


గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం పడుతుండటం మూలంగాను, రాత్రి పూట కావటం మూలంగాను కాబోలు ప్లాట్ ఫాం మీద సందడిలేదు. దూరంగా ఒకరిద్దరు ముష్టివాళ్ళు సిమ్మెంటు బల్లల వాయిన పొడిగా ఉన్నచోట ముడుచుకుని నిద్ర పోతున్నారు. ప్లాట్ ఫాం మీది మూసేసిన అమ్మకపుబళ్ళు కొనేవాళ్ళు రాక, అమ్మేవాళ్ళు లేక వెలవెల బోతున్నట్టున్నాయి.

సిమ్మెంటుదిమ్మ దగ్గర నిలబడి ఉన్న మనిషి చాలాసేపట్నుంచి నన్ను గమనిస్తున్నట్టని పించింది.

కొంపదీసి అతను దొంగా? నా ఒంటరి తనాన్ని గమనించి సూట్ కేసుని లాక్కు పారి పోవాలనుకుంటున్నాడా?

నేను గబుక్కున సూట్ కేసుని అందు కున్నాను. ఈలోగా రైలువచ్చి ఆగింది. దాన్లోనూ కలకలం కనిపించటంలేదు. కిటికీల షట్టర్స్ మూసేసి ప్రశాంతంగా నిద్రపోతున్నారు కాబోలు ప్రయాణీకులు.

నాముందు ఆగిన రిజర్వేషన్ కంపార్ట్ మెంట్ లోంచి, కోచ్ కండక్టర్ కాబోలు దిగి, నా వైపొకసారి చూసి, స్టేషన్ మాస్టర్ రూం కేసి అడుగులు వేశాడు.

"ప్లీజ్, యిది టి అప్పేనా?" నేను అతని వేపుగా రెండడుగులు వేసి అడిగేను. కుడిచేతి లోని వి.ఐ.పి. సూట్ కేసుని ఎడం చేతిలోకి మార్చుకుంటూ, "యస్" అని అతడు వెళ్ళి పోయేడు.

నేను ఆ కంపార్ట్ మెంట్ ఎక్కి, కిటికీ పక్క సీటు ఖాళీగా ఉంటే కూర్చున్నాను. పెట్టెలో వెలుగు అంతగా లేదు. అక్కడక్కడ నీలం బల్బులు వెలుగుతున్నాయి మసగ్గా. ప్రయాణీకులు ముసుగులు తన్ని నిద్రపోతు న్నారు.

అతనేంచేస్తున్నాడో?

నెమ్మదిగా షట్టర్ పైకెత్తి, ప్లాట్ ఫాం మీదికి చూశాను. ఆ మనిషి కాస్త యిటు వచ్చి నిలబడ్డాడు. నేనెక్కిన కంపార్ట్ మెంటు ద్వారం వేపు చూస్తూ.

ఎక్కుతాడా? ఎక్కి సూట్ కేసు లాక్కు పోతాడా?

గభాల్న లేచి, తలుపుకేసి వెళ్ళి, 'ధన్' మన్న శబ్దంతో తలుపు మూసి, 'యింటర్ లాక్' చేశాను. హృదయం కాస్త కుదుటపడినట్టు యుంది.

మళ్ళా వచ్చి సీట్లో కూర్చొని అతని వేపు చూశాను.

అతను యింకా అక్కడే నిలబడి ఉన్నాడు.

దేనికలా చూస్తున్నాడు? అవకాశం ఎక్క కుండా చేశాననా? రెండో వేపు ద్వారంలోంచి ప్రవేశిస్తే?

సూట్ కేసుని క్రింద పెట్టి, పైన కాళ్ళు పెట్టుకుని అతనివేపే చూస్తూ కూర్చున్నాను.

మరో రెండు నిమిషాల్లో యింజన్ కూత వేసింది. అతను పరుగు పరుగున నేను కూర్చున్న కిటికీ వేపు వచ్చాడు.

ఏం చేస్తాడు? కిటికీలోంచి చెయ్యిపెట్టి మెడలోని గొలుసు తెంపుకు పోతాడా?

గభాల్న షట్టర్ దించబోతుంటే, బండి కదిలింది.

"ప్లీజ్, మీరెక్కడ దిగుతారు?"

అప్రయత్నంగా నా నోటినుండి వెలు వడింది "టాటా."

అతను కదులుతున్న బండితోపాటు గబగబ నడుస్తున్నాడు కిటికీ కమ్మీలు పట్టుకుని.

"మరోలా అనుకోకపోతే ఈ ఉత్తరం టాటా ఆరెమ్మెస్ లో డ్రాప్ చేయండి. చాలా అర్జెంట్."

ఆయాసంతో అతని రొమ్ము ఎగిరెగిరి పడుతుంటే గభాల్న అతని చేతిలోని యిన్ లాండ్ కవర్ని అందుకున్నాను. *

## 'నా దేశాన్ని గూర్చి పాడలేను!'

నాగుండె రంపపు కోతకు గురవుతోంది
రాజకీయ నాయకులు!
పార్టీలు ఫిరాయిస్తున్నందుకు కాదు!
కవులు, రచయితల
'కొత్త సీసాల' ఆర్భాటాన్ని చూసి!!
అర్ధరాత్రి ఆడపిల్ల
నడిరోడ్డు మీద ఒంటరిగా
నడిచి వెళ్ళలేనందుకు కాదు!
నవ వధువు నాలుగు నాళ్ళు
ప్రాణ భయం లేకుండా
అత్తవారింట ఉండలేనందుకు!!
అధ్యాపకుణ్ణి బాధ్యతా రహితంగా
కుర్రాళ్ళు ఎదిరిస్తున్నందుకు కాదు!
కుంస్వాములు బెదిరిస్తున్నందుకు!!
పేర్రాసుకోవడం సరిగా రాకపోయినా
డిగ్రీల వరాలను ప్రసాదిస్తున్న
ప్రభుత్వ 'బ్రహ్మ'లను చూసికాదు!
'కేజీల పుస్తకాల బరువుతో
నడుం వంగిపోతున్న నవతరాన్ని చూసి
దేశాన్ని దోచుకు తినే దొంగల్ని చూసి కాదు!
దొరల్ని చూసి! దొరతనాన్ని చూసి!!

'పైడిపాల'